క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు వేజండ్ల విద్యార్థులు



వేజండ్ల(చేబ్రోలు): వాలీబాల్ పోటీలలో వేజండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రెండు రోజుల క్రితం నరసరావుపేట మినీ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ అండర్-17 బాలికల వాలీబాల్ జిల్లా జట్టు ఎంపికలలో చేబ్రోలు మండలం వేజండ్ల జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు వ్యాయమ ఉపాధ్యాయుడు తిరుమలశెట్టి వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. పి.బాల నాగ శ్రావ్య, మట్టుపల్లి దివ్యవాణి ఎంపికైనట్లు వివరించారు. జనవరి 23 నుంచి 25వ తేదీ వరకు కర్నూలులో నిర్వహించనున్న స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి అండర్-17 వాలీబాల్ పోటీలలో వీరు పాల్గొంటారు. పీఈటీ టి వెంకటేశ్వరరావు, విద్యార్థులను హెచ్ఎం విజయశ్రీ అభినందించారు.

పేదలకు వస్త్రాల పంపిణీ



గుంటూరు రూరల్: పేదలకు దుస్తులు శనివారం పంపిణీ చేశారు. పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యక్షుడు తిరుమలశెట్టి ఉమాశంకర్ మాట్లాడుతూ కొండా సాయి ప్రసాద్ సహకారంతో అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి జి.పవన్, సహాయ కార్యదర్శి ఆర్.యశ్వంత్, తేజ, నరేంద్ర పాల్గొన్నారు.

చలపతి ఫార్మసీలో అకడమిక్ ఎక్స్‌లెన్స్ అవార్డ్స్




గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి ఉజ్వల భవిష్యత్‌ను అందించి వారి అభివృద్ధికి తోడ్పడటమే చలపతి విద్యాసంస్థల లక్ష్యమని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. శనివారం నగర శివారుల్లోని లాంలోని కళాశాలలో చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అకడమిక్ ఎక్స్‌లెన్స్ అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆక్విటీ సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ బి.సుబ్రహ్మణ్యశర్మ, చైతన్య విద్యాసంస్థల ఏజీఎం ఈ దుర్గాప్రసాద్, చలపతి విద్యాసంస్థల సెక్రటరీ వై.సుజిత్‌కుమార్ పాల్గొన్నారు.

శివాలయానికి రూ.2లక్షల విరాళం



పెదకాకాని: శివాలయం అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి అన్నారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో అభివృద్ధి పనుల నిమిత్తం గుంటూరుకు చెందిన మన్నవ వెంకటేశ్వరరావు, శైలజ దంపతుల పేరిట 2 లక్షల రూపాయల నగదు విరాళంగా అందజేశారు. భక్తుల సౌకర్యార్థం అవసరమైన పనులకు నగదు ఉపయోగించాలని దాతలు కోరారు. అమావాస్య శనివారం రాహుకేతు పూజలకు అనుకూలంగా కావడంతో అధికసంఖ్యలో భక్తులు విచ్చేసి రాహుకేతువు పూజల్లో పాల్గొన్నారు. ఒక్కరోజులో 799 మంది పూజా కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా ఒక్క రోజులో స్వామివారికి రూ.3,99,500 ఆదాయం లభించినట్లు ఏసీ తెలిపారు.

విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి



రేటూరు(కాకుమాను): విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ కేఎఫ్ కెనడీ అన్నారు. మండలంలోని రేటూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా కెనడీ మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రతి ఉపాధ్యాయుడు నిరంతరం కృషి చేయాలని కోరారు. తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం 1-5వ తరగతిలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- కట్టెంపూడిలో గడప గడపకు మన ప్రభుత్వం



కట్టెంపూడిలో సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

కట్టెంపూడి(చేబ్రోలు): రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. పొన్నూరు రూరల్ మండలం కట్టెంపూడి గ్రామ సచివాలయం పరిధిలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. కుటుంబానికి రూ.లక్ష నుంచి అత్యధికంగా రూ.5లక్షల వరకూ లబ్ధి చేకూరినట్లు లబ్ధిదారులు వివరించారు. ఎమ్మెల్యే కిలారి ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా రోశయ్య మాట్లాడుతూ పేదల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా లబ్ధిదారులకు అందజేసేందుకు, అవినీతి రహిత పాలన కొనసాగించేందుకు ముఖ్యమంత్రి వినూత్న రీతిలో పరిపాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు అందించే ప్రతి సంక్షేమ పథకాన్ని వలంటీర్ల ద్వారా వారి ఇంటికి ముంగిటికే వచ్చి అందిస్తున్నామని వివరించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనం నాటిన దగ్గర నుంచి పంట విక్రయించుకునే వరకు అన్ని రకాల సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన కొన్ని సమస్యలను ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అక్కడక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వడాల శెట్టి శివనాగులు, ప్రసాద్, తోట శేషయ్య, వి.వెంకటేశ్వర్లు, ఎం.గోపి, నాగేంద్రమ్మ, పాలపర్తి సుబ్బారావు, నాగిశెట్టి నరసింహరావు, దాసరి నారాయణరావు, రుద్రపాటి ఆదిశేషు, అంబటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజలకు- ప్రభుత్వానికి వారధులు వలంటీర్లు

ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోశయ్య

పొన్నూరు(చేబ్రోలు): కరోనా కష్ట కాలంలో సొంత బంధువులే దగ్గరికి రాని పరిస్థితుల్లో వలంటీర్ వ్యవస్థ బ్రహ్మాండంగా పనిచేసిందని ప్రజలకు - ప్రభుత్వానికి వారధులుగా వలంటీర్లు పనిచేస్తున్నారని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. పొన్నూరు పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశం యావత్తు ఆంధ్రప్రదేశ్ లోని వలంటీర్ వ్యవస్థను చూసి గర్వించందన్నారు. వలంటీర్లపై పచ్చ మీడియా దుష్ప్రచారం చేస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కుల, మత వర్గ పార్టీలకు అతీతంగా అందరికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వలంటీర్లకే దక్కుతుందని చెప్పారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలకు కూడా వలంటీర్లు ఎన్నో సంక్షేమ పథకాలు అందించి మన్ననలు పొందుతున్నారని పేర్కొన్నారు. పేద, మధ్య తరగతి ప్రజల జీవనశైలిలో మార్పు కోసం అర్హులైన ప్రతి ఒక్కరికి పారదర్శకంగా ప్రభుత్వం పథకాలను అందిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఆకుల వెంకటేశ్వరరావు, బొద్దులూరి రంగారావు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 10న జాతీయ స్థాయి సాంస్కృతిక పోటీలు

ఆర్‌వీఆర్‌జేసీ అధ్యక్షుడు శ్రీనివాస్



కార్యక్రమం గోడ ప్రతులను విడుదల చేస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ఇంజినీరింగ్ విద్యార్థులకు జాతీయ స్థాయి సాంస్కృతిక పోటీలు ఫిబ్రవరి 10న నిర్వహించనున్నట్లు ఆర్‌వీఆర్‌జేసీ అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. చౌడవరంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వాల్‌పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కలరిడో-2023 పేరుతో పోటీలను నిర్వహించనున్నట్లు వివరించారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ మాట్లాడుతూ పోటీలలో దేశంలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొంటున్నారన్నారు. కళాశాల ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఆధునిక యుగంలో టెక్నాలజీ పెరిగి పోతున్న పోటీకి అనుగుణంగా ఇంజినీరింగ్ విద్యార్థులు నూతన ఆలోచనల్లో పెరిగిపోతున్న ఒత్తిడిని అధిగమించి మానసిక ఉత్తేజాన్ని పెంచేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ లిటరరీ, ఫైన్ ఆర్ట్స్, డ్రమాటిక్, సింగింగ్, డాన్స్, విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు, సర్టిఫికెట్లు అందిస్తున్నట్లు తెలిపారు. పేర్ల నమోదుకు కళాశాల వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఆర్‌వీఆర్‌జేసీసీఈ.ఇన్/సీఓఎల్ఓఆర్ఐడీఓ2023 అనే వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ ఆర్ అండ్ డీ డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోడింగ్‌లో ప్రావీణ్యత సాధించాలి

- ఏఎన్‌యూ మాజీ ప్రొఫెసర్ త్రిమూర్తి
- విజ్ఞాన్ నిరులలో హ్యాక్‌థాన్ 2023 ప్రారంభం



విశ్రాంత ప్రొఫెసర్ పీ త్రిమూర్తిని సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీ రాధిక తదితరులు

గుంటూరు రూరల్: పోటీ ప్రపంచంలో సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించాలంటే కోడింగ్‌లో విశేషమైన ప్రావీణ్యం సాధించాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంత ప్రొఫెసర్ పీ త్రిమూర్తి పేర్కొన్నారు. శనివారం పెదపలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో హ్యాక్‌థాన్- 2023ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడింగ్‌లో మార్పులను ఎప్పటికప్పుడు విద్యార్థులు ఒడిసిపట్టుకోవాలన్నారు. అప్పుడే మన మనుగడ సాధ్యమవుతుందని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ రాధిక మాట్లాడుతూ ఇటువంటి మారథాన్‌లు నిర్వహించటం ద్వారా విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో గుంటూరు, విజయవాడ, వైజాగ్ లతోపాటు ఇతర ప్రాంతాల నుంచి 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల సీఎస్ఈ విభాగాధిపతి సుజాత పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం

గుంటూరు రూరల్: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశం నగర శివారుల్లోని గోరంట్ల, రెడ్డిపాలెం సమీపంలోని ఇన్నర్ రింగ్‌రోడ్డులోని ఎంహెచ్ఆర్ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు చెప్పారు.

బాలికలపై లైంగిక వేధింపులను అరికట్టాలి



అప్పాపురం(కాకుమాను): సమాజంలో బాలికలు, మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులను అరికట్టేందుకు సమాజంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మహిళా పోలీస్ దుర్గ అన్నారు. మండలంలోని అప్పాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థినులకు, తల్లులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా దుర్గ మాట్లాడుతూ మహిళలను కాపాడాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి దిశ యాప్‌ను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం గేరా మోహనరావు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు రూరల్: అనారోగ్యం, కుటుంబ సమస్యలతో మానసిక ఒత్తిడికి గురైన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో శనివారం చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు.. నల్లపాడు గ్రామానికి చెందిన కనపర్తి నాగార్జున(32) సంవత్సరాలు పేయింట్ పనిచేసుకుని జీవిస్తుంటాడు. అతడికి వెంకటలక్ష్మి అనే మహిళతో ఏడుసంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య మనస్పర్థలతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. నాగార్జున మానసిక ఒత్తిడికి గురై అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ శనివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఇంటిపైకప్పుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు, బంధువులు పోలీసులకు సమాచారం అందించగా మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. మృతుడి తండ్రి దానియేలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కళాశాల బస్సు ఢీ కొని యువకుడికి గాయాలు

చేబ్రోలు: ప్రమాదవశాత్తూ ఇంజినీరింగ్ కళాశాల బస్సు ఢీ కొట్టడంతో యువకుడికి గాయాలైన ఘటన మండల కేంద్రమైన చేబ్రోలులో శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. బాపట్ల శ్రీనివాసరావుతోట ప్రాంతానికి చెందిన మాతా విజయకుమార్ విజయవాడలో మహేంద్రా షోరూంలో పనిచేస్తున్నాడు. ద్విచక్ర వాహనంపై బాపట్ల నుంచి విజయవాడ బయలు దేరిన విజయకుమార్‌ను చేబ్రోలులోని చేబ్రోలు ఇంజినీరింగ్ కళాశాల ఎదురుగా అదే కళాశాలకు చెందిన బస్సు ప్రమాదవశాత్తూ ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన విజయకుమార్‌ను 108లో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చేబ్రోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వీవీఐటీలో రెడిమిక్స్ వినియోగంపై సదస్సు



మాట్లాడుతున్న డాక్టర్ రమణరావు

పెదకాకాని: రెడీమిక్స్ కాంక్రీటు వినియోగం వలన వాతావరణ కాలుష్యం తగ్గించటమే కాకుండా సమతుల్యత అభివృద్ధి సాధ్యమవుతోందని వరంగల్ ఎన్ఐటీ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ రమణరావు అన్నారు. వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలోని సివిల్ ఇంజినీరింగ్‌కు చెందిన నిర్మాణధ్రష్ట విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిర్మాణాల కోసం రెడీమిక్స్ కాంక్రీటు వినియోగంలో ఉత్తమ పద్ధతులు పనితీరు అంశంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన వరంగల్ ఎన్ఐటీ డైరెక్టర్ డాక్టర్ రమణరావు మాట్లాడుతూ నూతనంగా నిర్మాణాలలో రెడీమిక్స్ వినియోగం గణనీయంగా పెరిగిందని, సులభంగా త్వరతగతిన నిర్మాణాలను పూర్తి చేయడానికి రెడీమిక్స్ ఒక మంచి ఎంపిక అన్నారు. ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న రెడీమిక్స్‌నే నిర్మాణాలకు వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, డీన్ ఆఫ్ అడ్మిన్ డాక్టర్ ఎస్.కుమారస్వామి, డీన్ ఆఫ్ అకడమిక్ డాక్టర్ కె.గిరిబాబు, సివిల్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.రత్నప్రసాద్ పాల్గొన్నారు.

'కాటూరి' ఆస్పత్రికి జప్తు వారెంట్ జారీ

- రూ.40 లక్షలు బకాయిలు
- ముందుగా ఒక ఏడాది బకాయికి చెక్కు ఇవ్వడంతో వెనుదిరిగిన యంత్రాంగం



కాటూరి ఆస్పత్రిలో జప్తు నోటీస్ అంటిస్తున్న పంచాయతీ సిబ్బంది

ఈదులపాలెం(ప్రత్తిపాడు): ఏడాదిన్నరగా పన్ను బకాయిలు చెల్లించకుండా, నోటీసులకు స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాటూరి ఆస్పత్రిపై పంచాయతీ అధికారులు కన్నెర్ర జేశారు. జప్తు వారెంటు జారీ చేశారు. ఆస్పత్రి అడ్మినిస్ట్రేటివ్ విభాగానికి తాళాలు వేసి, సీల్ వేసేందుకు సిద్ధమైన సమయంలో ఆస్పత్రి మేనేజ్‌మెంట్ ఏడాది బకాయికి చెక్కును ఇవ్వడంతో అధికారులు వెనుదిరిగిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఈఓపీఆర్డీ మావులూరి మోషె, పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాజా తెలిపిన ప్రకారం వివరాలు.. ప్రత్తిపాడు మండల పరిధిలోని ఈదులపాలెంలో విజ్ఞాన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ పేరుతో కాటూరి ఆస్పత్రి నిర్వహణలో ఉంది. దీనికి సంబంధించి 2021-22 సంవత్సరానికి గాను రూ.21,15,298, 2022-23 సంవత్సరానికి గాను రూ. 22,21,062 చొప్పున మొత్తం రూ.43,36,360 పంచాయతీకి పన్నులు చెల్లించాల్సి ఉంది. అయితే బకాయిలు చెల్లించాలంటూ ఏడాదిన్నరగా పంచాయతీ సిబ్బంది ఆస్పత్రి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఉపయోగం లేకుండా పోయింది. దీంతో గత ఏడాది సెప్టెంబరు 5వ తేదీన మొదటి నోటీసు, నవంబరు 14న రెండవ నోటీసు, డిసెంబరు 6న మూడో నోటీసును జారీ చేశారు. అయినప్పటికీ వారి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శి, మొదలు ఈఓపీఆర్డీలు పలు మార్లు మేనేజ్‌మెంట్‌ను అభ్యర్థించారు. ఈ నెల 20వ తేదీన డీఎల్‌పీఓ సైతం ఆస్పత్రికి వెళ్లి పన్నులు చెల్లించాలని విన్నవించినప్పటికీ వారి నుంచి సానుకూల స్పందన రాలేదు. ఈ నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం కాటూరి ఆస్పత్రిని జప్తు చేసేందుకు పంచాయతీ అధికారులు నిర్ణయించారు.

ఈవోపీఆర్డీ మోషె ఆధ్వర్యంలో మండలంలోని అన్ని పంచాయతీల పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, పంచాయతీ, పోలీస్, రెవెన్యూ సిబ్బంది అంతా కలిసి ఆస్పత్రి అడ్మినిస్ట్రేటివ్ విభాగాన్ని జప్తు చేసేందుకు వెళ్లారు. ముందుగా బకాయిలు మొత్తం చెల్లించాలని మేనేజ్‌మెంట్‌తో మాట్లాడినప్పటికీ ఫలితం కనిపించకపోవడంతో, జప్తు వారెంట్ జారీ చేసి, ఆస్పత్రి అడ్మినిస్ట్రేటివ్ విభాగంలో అంటించారు. సిబ్బంది అంతా బయటకు రావాలని తాళాలు వేసి సీల్ వేస్తామని ఈఓపీఆర్డీ ఆస్పత్రి సిబ్బందికి సూచించారు. దీంతో స్పందించిన యాజమాన్యం ముందుగా ఏడాది బకాయికి సంబంధించిన చెక్కును ఈఓపీఆర్డీకి అందించారు. మిగిలినవి కూడా మార్చి నెలాఖరులోగా చెల్లిస్తామని చెప్పడంతో అధికారుల బృందం అక్కడి నుంచి వెనుదిరిగారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ మాట్లాడుతూ జప్తు వారెంట్ జారీ చేశామని, నిర్ణీత గడువులోగా చెల్లించకుంటే ఇదే పద్ధతిని కంటిన్యూ చేసి జప్తు ప్రక్రియను పూర్తి చేస్తామని చెప్పారు.

వలంటీర్ల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



పెదకాకానిలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ నాగమల్లేశ్వరరావు తదితరులు

పెదకాకాని: సచివాలయాల్లో సేవాభావంతో విధులు నిర్వహించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకు రావాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల అంకమ్మరావు అన్నారు. 2023 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయీస్ అసోసియేషన్ రూపొందించిన క్యాలెండర్‌ను శనివారం ఎంపీడీఓ నాగమల్లేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం పెదకాకాని మండల అధ్యక్షుడుగా ఆరాధ్యుల శ్రీనాథ్, ప్రధాన కార్యదర్శి గా తాడికొండ బాలచంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్స్‌గా జొన్నలగడ్డ రాణి, వి.నాగరాజు, ఉపాధ్యక్షులుగా మాణిక్యరావు, పూర్ణసాయి, సహాయ కార్యదర్శులుగా శివపార్వతి, పవన్ కుమార్, ట్రెజరర్‌గా మోహన్ కృష్ణ , కార్యవర్గసభ్యులుగా షకీలా, భవ్యశ్రీ లను ఎన్నుకున్నారు. అసోసియేషన్ అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ వీఆర్ఆర్ కిషోర్, రీజినల్ కో ఆర్డినేటర్ తోట మహేష్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు తాడిబోయిన రాజేష్, కార్యదర్శులుఅనిల్ రాథోడ్, ధనలక్ష్మి పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం ఎంపీడీఓ నాగమల్లేశ్వరరావు, ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనవాసరావును ఘనంగా సత్కరించారు.

బోధనేతర ఉద్యోగుల సంఘం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన బోధనేతర సిబ్బంది సంఘం ప్రతినిధులను సన్మానిస్తున్న సభ్యులు

గుంటూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ యూనివర్శిటీస్ బోధనేతర ఉద్యోగుల సంఘం(ఏపీయూఎన్‌టీఈఏ) ఎన్నికలు శనివారం నగర శివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలో సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లోని 17 విశ్వవిద్యాలయాల బోధనేతర సంఘం నాయకులు పాల్గొన్నారు. ఎన్నికలకు ఎన్నికల అధికారిగా ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం జాయింట్ రిజిస్ట్రార్ ఎం.శ్రీనివాసరావు వ్యవహరించారు. కార్యక్రమంలో భాగంగా అధ్యక్షుడుగా వై.వెంకటప్పారెడ్డి, జీ సురేంద్రబాబు, జనరల్ సెక్రటరీగా ఎం.కుమార్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడుగా జె.గౌతంనాయుడు ఆర్గనైజింగ్ సెక్రటరీగా షేక్ అహ్మద్ బాషా, ట్రెజరర్‌గా నియమించబడ్డారు. ఏకగ్రీవంగా ఎన్నికై న వారికి ఎన్నికల ఆఫీసర్ సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం నూతనంగా ఏర్పాటైన కార్యవర్గాన్ని అన్ని విశ్వవిద్యాలయాల ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

అలరించిన గాత్ర కచేరీలు


పాత గుంటూరు: లక్ష్మీపురంలోని శ్రీ త్యాగరాజస్వామి కళావేదికపై గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో సంగీత జగద్గురు శ్రీ త్యాగబ్రహ్మ 176వ ఆరాధనా సంగీత మహోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరీలు ప్రేక్షకుల్ని అలరించాయి. డాక్టర్ వెంపటి దివ్య గాయత్రి, సంస్థ ప్రధాన కార్యదర్శి శేషురాణి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. లఘు కచేరీల్లో పలువురు కళాకారులు గాత్రం, వీణపై శ్రీ త్యాగరాజ కీర్తనల్ని ఆలపించారు. వీరికి వయోలిన్‌పై చావలి శ్రీనివాస్, మృదంగంపై రామరాజు కిశోర్ వాయిద్య సహకారాన్ని అందించారు. ప్రధాన కచేరీలో భవ్య హరి గానం శ్రావ్యంగా సాగింది. పలు త్యాగరాజ కీర్తనలను ఆలపించి సంగీతాభిమానుల్ని అలరించారు. వయోలిన్‌పై శివాని, మృదంగంపై బుర్రా శ్రీరామ్, ఘటంపై డాక్టర్ కె.అనీల్ కుమార్ వాయిద్య సహకారం అందించారు.

సిబార్ దంత వైద్య కళాశాలలో ఉచిత సేవలు

పెదకాకాని: ఇండియన్ ప్రోస్థోడాంటిస్ట్స్ డే సందర్భంగా పేదలకు ఉచిత దంత వైద్య సేవలు అందించడం జరుగుతుందని సిబార్ దంత వైద్య కళాశాల డీన్ డాక్టర్ ఎల్.కృష్ణప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా పూర్తిగానూ, పాక్షికంగా పళ్ళు లేనివారికి తీసి పెట్టుకునే పద్ధతిలో ఉచితంగా పళ్ల సెట్టు కట్టడం జరుగుతుందన్నారు. కృత్రిమ పళ్ల సెట్ కొరకు జనవరి 23,24,25 తేదీలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల లోపు సిబార్ దంత వైద్య కళాశాలలోని కట్టుడు పళ్ళ విభాగంలో పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇండియన్ ప్రోస్థోడాంటిస్ట్స్ డే సందర్భంగా దంత వైద్య విద్యార్థులు అందంగా, ఆకర్షణీయంగా రంగవల్లులు అలంకరించారు.

జగనన్న లేఅవుట్‌లో వసతులు కల్పించాలి

హౌసింగ్ పీడీ సాయినాథ్‌కుమార్



ప్రత్తిపాడులో సమీక్ష చేస్తున్న పీడీ సాయినాథ్‌కుమార్

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులోని జగనన్న లేఅవుట్‌లో వెంటనే డ్రైయిన్లు, లే అవుట్‌లు ఏర్పాటు చేయాలని హౌసింగ్ పీడీ సాయినాథ్‌కుమార్, డీపీవో కేశవరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని జగనన్న లే అవుట్‌లో శనివారం హౌసింగ్ పీడీ కె సాయినాథ్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి ఆర్ కేశవరెడ్డిలు సమావేశాన్ని నిర్వహించారు. ఉగాది నాటికి ప్రతి ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవలసిందేనని స్పష్టం చేశారు. లబ్ధిదారులకు కావలసిన అన్ని రకాల వసతులను లేఅవుట్లలో కల్పించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని, ఆయా శాఖల అధికారులు సమన్వయంతో కలిసి పనులు చేయాలన్నారు.

హౌసింగ్ ఏఈకి పీడీ క్లాస్..

ప్రత్తిపాడు హౌసింగ్ ఏఈ సాగర్ సురేష్‌కు ఆ శాఖ పీడీ సాయినాథ్‌కుమార్ క్లాస్ తీసుకున్నారు. నీవు ముందు సబ్జెక్టు తెలుసుకో. తెలియకుండా ఏమీ మాట్లాడకు. నీకు తెలియకపోతే నీపై అధికారులు, డీఈ, ఈఈలు ఉన్నారు. వాళ్లని అడిగి తెలుసుకుని పూర్తి వివరాలు చెప్పు. అంతేగానీ నీ ఇష్టమొచ్చినట్లు, నోటికి ఏదొస్తే అది చెప్పవద్దని ఏఈని మందలించారు. సమావేశంలో ఎంపీడీఓ శ్రీరమ్య, పీఆర్ డీఈ రాంబాబు పాల్గొన్నారు.

సబ్‌ప్లాన్ చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలి

ఎమ్మెల్యే మేకతోటి సుచరితకు వినతి

గుంటూరు రూరల్: ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరుతూ పలు ప్రజా సంఘాల నేతల ఆధ్వర్యంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరితకు శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ విషయాన్ని ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రాన్ని అందజేసిన వారిలో భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ళ ప్రకాష్, ఏకలవ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు, యానాది హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏసుబాబు, అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల వీరాస్వామి, భీమ్‌సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపు నీలాంబరం, రావినూతల కమలకుమారి, రజనీకాంత్, ముని పాల్గొన్నారు.